
నాగార్జున

## ఈ సారి పండక్కి నా సామిరంగ..

మోడ్రెన్ లుక్‌తో మురిపించినా, విలేజ్ లుక్‌లో మెరిపించినా.. ఎలా చూసినా.. ఎటునుంచి చూసినా నాగార్జున స్టైలే వేరు. ఆయన్ని వెండితెర మన్మథుడు అనేది అందుకే. నాగ్ ప్రస్తుతం 'నా సామిరంగ' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. చంద్రబోస్ రాయగా, ఎం.ఎం.కీరవాణి స్వరపరిచిన 'ఎత్తుకెళ్లి పోవాలనిపిస్తుంది..' అంటూ సాగే ఈ సినిమాలోని తొలిపాటను మేకర్స్ త్వరలో విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ఈ సినిమా పోస్టర్‌ని విడుదల చేశారు. వ్యవసాయ భూమిలో ట్రాక్టర్‌పై కాలు వేసి, బీడీ కాలుస్తూ పక్కా మాస్‌గా ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు నాగ్. విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రానికి శ్రీనివాస్ చిట్టూరి నిర్మాత. సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది. నాగార్జున కెరీర్‌లోనే ఇప్పటివరకూ చేయని విభిన్నమైన పాత్రను ఇందులో చేస్తున్నారని, కథ, కథనాలు వాస్తవికతకు అద్దంపట్టేలా ఉంటాయని దర్శకుడు చెప్పారు. ఆషికా రంగనాథ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కరుణకుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. నిర్మాణం చివరి దశకు చేరుకున్న ఈ చిత్రానికి మాటలు: ప్రసన్నకుమార్ బెజవాడ.

## ఆ వీడియోను నమ్మొద్దు

డీప్ ఫేక్ వీడియోలు దేశానికే పెద్ద సమస్యగా మారాయి. సామాన్యుల దగ్గర్నుంచి సెలబ్రిటీల వరకూ చాలామంది వీటి బారిన పడుతున్న పరిస్థితి ప్రస్తుతం నెలకొన్నది. ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ వీటి బారిన పడుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ఇప్పుడు బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా వంతు వచ్చింది. ఆమె డీప్ ఫేక్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. ప్రియాంక పాత వీడియోలో ఆమె వాయిస్ మాత్రం మార్చేసి, తాను ఓ నకిలీ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నట్లు లిప్‌సింక్ చేశారు. ఆ బ్రాండ్ వల్ల తన వార్షిక ఆదాయం బాగా పెరిగిందని, కాబట్టి అందరూ దాన్ని వాడాలని ప్రియాంక చెబుతున్నట్టు ఆ వీడియోను క్రియేట్ చేశారు. దీనిపై ప్రియాంక స్పందిస్తూ.. 'నేను ఏ బ్రాండ్‌నీ ప్రమోట్ చేయలేదు. ఇది నిజంగా దారుణం. నా వీడియోలో వాయిస్‌ని మార్చేసి, నేనే చెబుతున్నట్టు తయారు చేసి విడుదల చేశారు. దయచేసి ఈ వీడియోను నమ్మొద్దు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. లేకపోతే ముందుముందు చాలా దారుణాలు చూడాల్సొస్తుంది.' అంటూ వాపోయింది ప్రియాంక.


ప్రియాంకచోప్రా


నాని

## 'హాయ్ నాన్న' ఆ లోటు తీరుస్తుంది.

' 'హాయ్ నాన్న' చాలా ఎమోషనల్ ఫిల్మ్. చూసి ఆనందంగా నవ్వుతూ బయటికొస్తారు. ఆ ఆనందంలోనే మనసుని హత్తుకునే ఎమోషన్ హై ఉంటుంది.' అన్నారు నాని. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న' మృణాళ్‌ఠాకూర్ కథానాయిక. బేబీ కియారా ఖన్నా కీలక పాత్ర పోషించింది. శౌర్యువ్ దర్శకుడు. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల నిర్మాతలు. ఈ గురువారం ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా నాని విలేకరులతో ముచ్చటించారు. 'నేను ఏ జానరైనా కంఫర్ట్‌గానే ఫీలవుతా. ఇమేజ్‌ను కూడా పట్టించుకోను. కథ నచ్చితే చేసేస్తా. నేను చేసిన సినిమాలన్నీ ఎంజాయ్ చేస్తూ చేసినవే. దర్శకుడు శౌర్యువ్ ఈ కథ చెప్పినప్పుడే చాలా హై వచ్చింది. 'యానిమల్'తో సహా ఈ ఏడాది వచ్చిన యాక్షన్ సినిమాలు కావాల్సిన దానికంటే ఎక్కువ స్పైసీని పంచాయి. కారం తిన్న తర్వాత కాస్త స్వీట్ కూడా టేస్ట్ చేయాలి. 'హాయ్ నాన్న' ఆ లోటు తీరుస్తుంది. ఈ ఏడాది అందరూ అన్ని ఐటమ్స్ పెట్టారు. ముంగించే ఐటెం నేను పెడతా.' అన్నారు నాని. మృణాళ్ ఠాకూర్ పోషించిన యష్ణ పాత్ర ఎవరూ ఊహించని విధంగా ఉంటుందని, బేబీ కియారా ఖన్నా నటన మనసులకు హత్తుకుంటుందని, సాంకేతికంగా సినిమా నెక్ట్స్ లెవల్లో ఉంటుందని నాని చెప్పారు. 'యానిమల్'లో రణ్‌బీర్ చేసినటువంటి పాత్ర చేయాలనుందని, భవిష్యత్తులో అంతకంటే మ్యాడ్‌నెస్ ఉన్న పాత్ర చేస్తానేమో చెప్పలేనని, అలాంటి పాత్ర దొరికితే మాత్రం వదలనని నాని తెలిపారు.

## చెబుతున్న ప్రతిసారీ నవ్వుతూనే ఉన్నా

'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' పూర్తి వినోదాత్మక చిత్రం. ఇందులో జూనియర్ ఆర్టిస్ట్ కేరక్టర్ పోషించాను. ఈ మూవీ పూర్తిగా ఎంటర్టైన్‌మెంట్ మోడ్‌లో ఉంటుంది. ఈ కథను చెబుతున్న ప్రతిసారీ నవ్వుతూనే ఉన్నాను' అంటున్నారు హీరో నితిన్. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్'. శ్రీలీల కథానాయిక. వక్కంతం వంశీ దర్శకుడు. ఎన్.సుధాకర్‌రెడ్డి, నిఖితారెడ్డి నిర్మాతలు. ఈ నెల 8న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నితిన్ విలేకరులతో మాట్లాడారు. 'ఇందులో కథనంతోపాటు కేరక్టరైజేషన్స్ కూడా కొత్తగా ఉంటాయి. వక్కంతం వంశీ ఇప్పటివరకూ రాసిన పాత్రల్లో ఇందులో నాకోసం రాసిన పాత్ర బెస్ట్ అని చెప్పొచ్చు. ఈ కథలో తండ్రీకొడుకుల సెంటిమెంట్ కొత్తగా ఉంటుంది.' అని చెప్పారు నితిన్. ఇంకా మాట్లాడుతూ 'డాక్టర్ రాజశేఖర్ ఈ సినిమాలో ప్రత్యేకపాత్ర పోషించారు. ఆయన వచ్చాకే కథ నెక్ట్స్ లెవల్‌కి వెళ్తుంది. అసలు ఆయన ఈ పాత్ర చేయడానికి ఒప్పుకోరేమో అనుకున్నాం. కానీ వంశీ మాత్రం ఆయనే కావాలని పట్టుబట్టారు. శివానీ, శివాత్మిక బతిమాలడంతో కూతుళ్ల మాట కాదనలేక రాజశేఖర్ అంగీకరించారు. ఆ విషయంలో వాళ్లిద్దరూ మాకు పెద్ద హెల్ప్ చేశారు. ఆయన పాత్రే ఈ సినిమాకు హైలెట్. ఇందులో సంపత్, రావురమేశ్ పాత్రలు కూడా కొత్తగా ఉంటాయ్' అని చెప్పారు. హేరిస్ జైరాజ్ సంగీతం ఈ సినిమాకు ప్రధానబలమని, సాంకేతికంగా కూడా ఈ సినిమా అద్భుతంగా ఉంటుందని నితిన్ అన్నారు.


నితిన్

## ఆడియన్స్ థ్రిల్ ఫీలవుతున్నారు..

'మంచి ప్రొడక్ట్ చేశామని తెలుసు. అయితే ఇంత స్పందన ఊహించలేదు. విక్రమ్‌కుమార్ కథ చెబుతున్నప్పుడే ఆ ప్రపంచంలో మనల్ని హోల్డ్ చేస్తారు. అయితే ఈ కథను ఎనిమిది ఎపిసోడ్స్‌గా ఎలా మలుస్తారనే క్యూరియాసిటీ ఉండేది. కొన్ని నెలల తర్వాత ఎపిసోడ్స్ వారీగా చెప్పారు. థ్రిల్ ఫీలయ్యాం. ఇప్పుడు ఆడియన్స్ కూడా అదే థ్రిల్ ఫీలవుతున్నారు.' అని నిర్మాత శరత్‌మరార్ అన్నారు. అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా ఆయన నిర్మించిన వెబ్‌సిరీస్ 'దూత'. విక్రమ్ కె.కుమార్ దర్శకుడు. ప్రియాభవానీశంకర్, పార్వతి తిరువోతు, ప్రాచీ దేశాయ్ కీలక పాత్రధారులు. ఈ నెల 1నుంచి ఈ సిరీస్ తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విజయవంతంగా ప్రసారం అవుతున్నది. ఈ సందర్భంగా శరత్‌మరార్ విలేకరులతో మాట్లాడారు. 'నాగచైతన్య చేయడానికి ముందుకు రాకపోతే ఈ సిరీస్ లేదు. ఆయన కెరీర్‌లోనే బెస్ట్ అనిపించేలా ఇందులో నటించారు. ఆ మాటకొస్తే ఇందులోని ప్రతి ఒక్కరూ గొప్పగా నటించారు' అన్నారు శరత్‌మరార్. తనను పవన్‌కల్యాణ్ సినీనిర్మాతను చేశారని, భవిష్యత్ అంతా వెబ్ చుట్టూనే తిరుగుతుంది కాబట్టే, త్వరగా వెళితే అందులోని గ్రామర్ అర్థమవుతుందని వెబ్‌సిరీస్ చేయడం మొదలుపెట్టానని, గతంలో ఎన్ని చేసినా, 'దూత' ఇచ్చి విజయం మాత్రం మెమరబుల్ అని శరత్‌మరార్ ఆనందం వెలిబుచ్చారు. '240 దేశాల్లో ఈ సిరీస్ విడుదల చేయడమే కాక, 38 భాషల్లో సబ్‌టైటిల్స్ చేశారు. పనిచేసిన ఆర్టిస్టులందరూ ప్రపంచానికి పరిచయం అయ్యారు. ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్‌లో కూడా 'దూత'లోని ఒక ఎపిసోడ్ ప్రదర్శించాం. ఇలా ఆర్థికంగానేకాక, మానసికంగా కూడా సంతృప్తినిచ్చింది 'దూత' ' అని చెప్పారు శరత్‌మరార్.


శరత్ మరార్


విరాజ్ అశ్విన్, బుచ్చిబాబు, అను ప్రసాద్

## యువతరం జోరుగా హుషారుగా..

'బేబీ' ఫేం విరాజ్ అశ్విన్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'జోరుగా హుషారుగా'. పూజిత పొన్నాడ కథానాయిక. అను ప్రసాద్ దర్శకుడు. నిరీష్ తిరువీధుల నిర్మాత. ఈ నెల 15న చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని 'ఉప్పెన' దర్శకుడు బుచ్చిబాబు సానా చేతులమీదుగా విడుదల చేశారు. సినిమా విజయం సాధించాలని బుచ్చిబాబు చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'బేబీ' సినిమాతో యువతకు చేరువైన విరాజ్ ఈ సినిమాతో యువతకు మరింత దగ్గరవుతాడని, కొత్తదనం ఆశించే ప్రేక్షకులకు ఈ సినిమా నచ్చుతుందని దర్శకుడు చెప్పారు. 'జోరుగా హుషారుగా' అనే టైటిల్‌కి తగ్గట్టే ఈ చిత్రంలో అందర్నీ ఆకట్టుకునే వినోదం ఉంటుందని, యువతరం మెచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందని నిర్మాత తెలిపారు.

## 'దళారి' రాజకీయం

రాజీవ్ కనకాల, షకలక శంకర్, శ్రీతేజ్, అక్సాఖాన్, రూపిక ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'దళారి'. కాచిడి గోపాల్‌రెడ్డి దర్శకుడు. ఎడవెల్లి వెంకట్‌రెడ్డి నిర్మాత. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. సి.కల్యాణ్, ఫిల్మ్ ఛాంబర్ వైస్ ప్రెసిడెంట్ రాందాసు అతిథులుగా హాజరై సినిమా యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. అన్నదమ్ముల అనుబంధమే ప్రధాన ఇతివృత్తంగా ఈ చిత్రం తెరకెక్కిందని, ఈ నెల 15న విడుదల చేస్తున్నామని నిర్మాత చెప్పారు. దళారి పాత్ర రాజకీయాల్లో ఉంటే ఎలా ఉంటుందో మా సినిమాలో చూపించామని దర్శకుడు తెలిపారు. ఇంకా నిర్మాతలు దామోదరప్రసాద్, ప్రసన్నకుమార్, టీఎస్‌రాజు, సలీం, అఖిల్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




రోషన్ కనకాల, మానస చౌదరి

## మనసులకు హత్తుకునే బబుల్‌గమ్

రాజీవ్ కనకాల, సుమ కనకాల దంపతుల కుమారుడు రోషన్ కనకాల హీరోగా పరిచయమవుతున్న సినిమా 'బబుల్‌గమ్'. మానస చౌదరి కథానాయిక. రవికాంత్ పేరేపు దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మహేశ్వరి మూవీస్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని మూడవ గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. 'జానూ...' అంటూ సాగే ఈ పాటను అనంతశ్రీరామ్ రాయగా, శ్రీచరణ్ పాకాల స్వరాలందించారు. జావెద్ అలీ ఆలపించారు. లోతైన సాహిత్యంతో తయారైన ఈ పాట మనసుల్ని హత్తుకుంటుందని, విడుదలైన రెండు పాటలూ శ్రోతల్ని అలరించాయని, ఈ మూడో పాట కూడా అందరికీ నచ్చుతుందని మేకర్స్ నమ్మకం వెలిబుచ్చారు. ఈ చిత్రానికి కెమెరా: సురేశ్ గరుతు, ఎడిటింగ్: నిషాద్ యూసుఫ్.

## గర్ల్‌ఫ్రెండ్‌గా నేషనల్ క్రష్

రష్మికను అందరూ 'నేషనల్ క్రష్' అని ముద్దుగా పిలుస్తుంటారు. దానికి తగ్గట్టే పుష్ప, యానిమల్ సినిమాలతో జాతీయస్థాయిలో యువతరం కలలరాణిగా అవతరించింది రష్మిక. ఇప్పటివరకూ హీరోల పక్కన జతకట్టి సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ అందం.. తొలిసారి లేడీఓరియెంటెడ్ సినిమాలో తళుక్కున మెరవనుంది. అన్నీ తానే అయ్యి సినిమాను భుజాలపై మోయడానికి రెడీ అయిపోయింది. ఆ సినిమానే 'ది గర్ల్ ఫ్రెండ్'. మాస్ మూవీమేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి ప్రతిష్టాత్మక గీతాఆర్ట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని నిర్మాతలు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో మొదలైంది. రష్మికకు, సినిమా టీమ్‌కు సమర్పకులైన అల్లు అరవింద్ దీవెనలందించారు. నిరవధికంగా 20రోజులపాటు జరిగే ఈ షెడ్యూల్‌లో రష్మికతోపాటు కీలక నటీనటులందరూ పాల్గొంటారు. ఇదో వైవిధ్యమైన ప్రేమకథ అని, ఒక సూపర్‌హిట్ సినిమాకు పనిచేస్తున్నామనే పాజిటీవ్ ఫీలింగ్, కాన్ఫిడెన్స్‌తో షూటింగ్ మొదలుపెట్టామని మేకర్స్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: కృష్ణవసంత్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్.


రష్మిక





